## క్లుప్తంగా

### కో- ఆప్షన్ సభ్యుడిగా మహమ్మద్ రఫీ



**దామరగిద్ద:** మండల కో -ఆప్షన్ సభ్యుడి పోస్టు ఖాళీగా ఉండటంలో నాలుగు రోజుల క్రితం నోటిఫికేషన్ జారీచేశారు. గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీరాం చందర్ ఆర్డీఓ సమక్షంలో నామినేషన్ పత్రాలను స్వీకరించి ఎన్నికలు నిర్వహించారు. మమ్మద్ రఫీ కో -ఆప్షన్ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సప్ప, ఎంపీడీఓ శ్రీధర్, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### మీసేవ కేంద్రాలను ఏర్పాటుచేయాలి

**దామరగిద్ద:** జనాభా ప్రాతిపదికన మీసేవ కేంద్రాలను ఏర్పాటుచేయాలని సమాచార హక్కు చట్టం జిల్లా సభ్యుడు మోహన్‌రాజ్ అన్నారు. గురువారం ఈడీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. మండలానికి ఒకటి రెండు ఆధార్ కేంద్రాలు మాత్రమే ఉండటంతో ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, ఆధార్ కేంద్రాల చుట్టు తిరిగే దుస్థితి నెలకొందని వాపోయారు. జనాభాకు సరిపడా కేంద్రాలను పంచాయతీలోనే ఏర్పాటు చేయాలని కోరారు.

### నేటినుంచి తిమ్మప్పస్వామిఉత్సవాలు

**నారాయణపేట రూరల్:** మండలంలోని ఎక్లాస్‌పూర్ తిమ్మప్పస్వామి జాతర మహోత్సవాలు ఈ నెల 16నుంచి ప్రారంభం కానున్నాయి. శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 23న ప్రభోత్సవం, 24న రథోత్సవం , 26న జాతర జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

### విద్యుదాఘాతంతో పాడిగేదెమృతి

**మరికల్:** విద్యుత్ తీగలు తెగిపడి పాడి గేదె మృతి చెందింది. మరికల్‌కు చెందిన పల్లెర్ల నర్సింహులుకు చెందిన గేదె గురువారం పక్క పొలాల్లోకి మేతకోసం వెళ్లగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు గేదెకొమ్ములకు తగలడంతో తెగిపడి అక్కడిక్కడే మృతి చెందిందని బాధిత రైతు తెలిపారు. విద్యుత్‌శాఖ తరఫున బాధిత రైతును ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### ఇసుక డంప్‌ల సీజ్

**మాగనూర్:** మండల పరిధిలోని వర్కూర్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న రైస్‌మిల్లుకు అక్రమంగా తరలించిన మూడు ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను గుర్తించి సీజ్‌చేసినట్లు రెవెన్యూ ఆర్ఐ శ్రీశైలం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా.. వర్కూర్ పెద్దవాగునుంచి ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా బుధవారం రాత్రి సమయంలో ఇసుక తరలించినట్లు రైతులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు రైస్‌మిల్లు వద్ద ఉన్న ఇసుకను గుర్తించినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని, ప్రభుత్వ అనుమతితోనే ఇసుకను తరలించుకోవాలని సూచించారు.

### భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు

**మక్తల్:** మండలంలోని కర్నిలో గుండురంగస్వామి ఉత్సవాల సందర్భంగా గురువారం సాయంత్రం భక్తులు ప్రభోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నేటినుంచి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం 6 గంటలకు రథోత్సవం, 17న ఉట్లు కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### నేటినుంచి లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలు

**మరికల్:** మండలంలోని ఎక్లాస్‌పూర్ స్టేజీ వద్ద లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి శివుడు, నర్సింహులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 16నుంచి 25వరకు ఉత్సవాల నిర్వహణ జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### ఆలయంలో పూజలు

**నర్వ:** లక్కర్‌దొడ్డిలో కొనసాగుతున్న ఎల్లమ్మ దేవర ఉత్సవాల సందర్భంగా గురువారం కాంగ్రెస్ నాయకులు ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ సోదరులు ఉత్సవాల విశిష్టతను వారికి తెలియజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ నీరజ్, లక్కర్‌దొడ్డి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేష్, వావిళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి, రామన్‌గౌడ్, నర్సింహ, మహేష్‌గౌడ్, మల్లేష్, రాంచంద్రి, డ్రైవర్ కొండన్న ఉన్నారు.



# రైతన్నలకు అందని పీఎం కిసాన్

- ఆధార్ సీడింగ్ పేరుతో నిలిచిన వైనం
- ఈకేవైసీ చేసిన ఖాతాలో పడని డబ్బులు
- ఐదు విడతలుగా ఇదే తంతు
- 748 మంది రైతులకు అందని పథకం



**దామరగిద్ద:** చిన్న సన్నకారు రైతులను పెట్టుబడి సహాయం కింద చిన్న సన్నకారు రైతులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ఆధార్ సీడింగ్ పేరుతో అర్హులైన రైతులకు అందడం లేదు. 2019 ఫిబ్రవరిలో ప్రధాని మోదీ ప్రారంభించిన పథకం 15 విడుతలుగా రైతులకు ప్రతి 4 నెలకొకసారి 2వేల చొప్పున ఏటా ఒక్కోరైతుకు రూ.6వేలు పెట్టుబడి సాయం అందిస్తుంది. కాగా 2021 సంవత్సరంలో 12వ విడత నుంచి ప్రత్యేకంగా బ్యాంక్ ఖాతాకు ఆధార్ సీడింగ్ పేరుతో కొర్రీలు విధించడంతో చాలామంది రైతులకు అందాల్సిన డబ్బులు అందడం లేదు. దీంతో మూడేళ్లుగా బ్యాంకుల చుట్టు తిరిగిన ఖాతాలో జమకావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ప్రతి విడతకు ముందు ఇన్‌యాక్టివ్ లిస్ట్**

ప్రతి విడతకు ముందు వ్యవసాయ అధికారులు ఆధార్ లేని రైతుల లిస్ట్‌ను రైతులను తెలియజేస్తున్నారు. అధికారులు ఆధార్ సీడింగ్ చేసుకోవాలని చెప్పడంతో రైతులు తిరిగి సీఎస్‌పీ కేంద్రాల్లో ఆధార్ సీడింగ్ చేపట్టి బ్యాంక్‌లో అందించిన అప్‌డేట్ కాకపోవడంతో పథకం డబ్బులు రావడం లేదంటున్నారు. ఈ విషయమై బ్యాంక్ అధికారులను వివరణ కోరగా మూడేళ్లకింద ప్రభుత్వం ఆధార్ సీడింగ్ ఉన్న ఖాతాలకు పథకం డబ్బులు అందిస్తున్నట్లు చెబుతుందన్నారు. రైతులు బ్యాంక్‌కు వచ్చి ఈ కేవైసీ చేసుకోకపోవడం లేదా పోస్టా పీస్, లేదా ఇతర బ్యాంక్‌లోని రైతుల ఖాతాలకు ఆధార్ సీడింగ్ అయిఉంటే ఆయా ఖాతాలకు డబ్బులు పడుతుంటాయి. 2019 ఫిబ్రవరి తరువాత పట్టదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులకు పథకం మంజూరు కావడం లేదని అధికారులు అంటున్నారు. పథకం మంజూరై మధ్యలో నిలిచిన రైతులు తమ బ్యాంక్ ఖాతాలకు మ్యాపింగ్ స్టేటస్ ఇన్‌యాక్టివ్‌లో ఉండటంలో డబ్బులు పడటం లేదు.

**నాలుగు విడతలుగా డబ్బులు పడటం లేదు**



బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింక్ లేదంటు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికి రెండు సార్లు ఈకేవైసీ చేసి బ్యాంక్లో ఇచ్చిన, డబ్బులు పడటం లేదు. ఏఈఓ సార్‌ను అడిగితే మ్యాపింగ్ స్టేటస్ ఇన్‌యాక్టివ్‌లో ఉంది బ్యాంకులో ఈకేవైసీ చేయించాలంటున్నాడు.

- బుగ్గప్ప, రైతు, చాకలోన్‌పల్లి

**ఈకేవైసీ అప్‌డేట్ చేయించాలి**



పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు పొందేందుకు మ్యాపింగ్ స్టేటస్ ఇన్‌యాక్టివ్ ఉంటే డబ్బులు పడవని చెబుతున్నాం. అయినా రైతులు మ్యాపింగ్ అప్‌డేట్ చేసుకోవడం లేదు. ఈకేవైసీ దాదాపు అందరు చేసుకుంటున్నారు. మ్యాపింగ్ స్టేటస్ ఇన్‌యాక్టివ్‌లో కనిపిస్తుంది. రైతులు మీ సేవా కేంద్రాలకు వెళ్లి ఏ ఖాతాలకు లింక్ అయి ఉందో ఆ బ్యాంకులో మ్యాపింగ్ అప్‌డేట్ చేయించాలి.

- ప్రదీప్‌కుమార్, వ్యవసాయ అధికారి

## మహిళలను రక్షించడమే షీ టీం లక్ష్యం



మాట్లాడుతున్న షీటీం ఏఎస్సై శ్రీదేవి

**కోస్గి:** మహిళలను వేదింపులనుంచి రక్షించడమే షీ టీం లక్ష్యమని ఏఎస్సై శ్రీదేవి సూచించారు. ఈ మేరకు గురువారం గుండుమాల్ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలికలు, మహిళల రక్షణ కోసం చేపడుతున్న షీటీం, బాల్యవివాహాలు, మూఢనమ్మకాలు, సైబర్ నేరాలు, బ్యాంకు మోసాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు, మహిళల సంరక్షణ కోసం ప్రత్యేకంగా నియమించబడ్డ షీటీంలు ఉదయం, సాయంత్రం సమయాల్లో ఆర్టీసీ బస్టాండ్‌లు, విద్యార్థులు రద్దీగా ఉండే ఆటో స్టాండ్‌లతోపాటు ప్రధాన చౌరస్తాల్లో గస్తీ నిర్వహిస్తారన్నారు. సివిల్ డ్రస్‌లో ఉండే షీటీం సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని, వేదింపుల్ని భరించకుండా పోలీసులకు 100కుగాని, 8712670398 నంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. షీటీం పోలీసులు బాల్‌రాజ్‌తోపాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా సేవాలాల్ జయంతి



మద్దూరులో సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గిరిజనలు

**కోస్గి(మద్దూరు):** గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని మండల కేంద్రంలో మండల గిరిజన నాయకులు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని తాండాల నుంచి గిరిజనులు వచ్చి పాతబస్టాండ్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం పాతబస్టాండ్‌కు చేరుకున్నారు. ఈ మేరకు.. ఆంజనేయస్వామి ఆలయం వద్ద సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కొత్తపల్లి మండల కేంద్రంలో సేవాలాల్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సేవాలాల్ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, గిరిజన నాయకులు రవినాయక్, అనిల్‌నాయక్, లక్ష్మణ్, కృష్ణ, యుద్ధం, రమేష్ పాల్గొన్నారు.

**మరికల్:** సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతిని మండలంలోని గురువారం గిరిజనులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంప్రదాయాలతో నృత్యాలు చేస్తు అలరించారు. అనంతరం సేవాలాల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. హిందు సమాజం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అఖిల పక్షం పార్టీల నాయకులు, బంజార నాయకులు పాల్గొన్నారు.

**నర్వ:** మండలంలోని బుడ్యగాని తాండాలో సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం వారికి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

## సరాఫ్ కృష్ణ సేవలు మరువలేనివి



సరాఫ్ కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు, కుటుంబ సభ్యులు

**నారాయణపేట:** కాంగ్రెస్ సీనియర్ నాయకులు సరాఫ్ కృష్ణ ఈ ప్రాంతానికి చేసిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ అన్నారు. గురువారం వామన్‌గారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఆయన ఏకాదశ దినకర్మకు వివిధ పార్టీల నాయకులతోపాటు వ్యాపారవేత్తలు, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 1969లో తెలంగాణ ఉద్యమం మొదలుకొని.. మూడు దశాబ్దాల పాటు ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణభట్టడ్, మాజీ మార్కెట్ చైర్మన్లు సరాఫ్ నాగరాజు, సుధాకర్, మాతామాణికేశ్వరి కమిటీ సభ్యులు మందార్, శివరాంరెడ్డి, వివిధ పార్టీల నాయకులు విజయ్‌సాగర్, వెంకటయ్య, జయంత్‌రెడ్డి, రాము, కాశీనాథ్, నారాయణ పాల్గొన్నారు.

## కృష్ణా తీరంలో సినీనటుల సందడి



**కృష్ణా:** బాహుబలి చిత్రంలో నటించిన కళాకారులు ప్రదీప్, ప్రహ్లాద్ గురువారం కృష్ణానది తీరంలో సందడి చేశారు. ముందుగా ఇక్కడి ఆలయంలో అర్చకులు అజిత్ దీక్షిత్ ఆధ్వర్యంలో ప్రత్యేక చేశారు. అనంతరం పరిసరాల్లో కలియతిరిగి ఈ ప్రాంత విశిష్టత గురించి తెలుసుకున్నారు. వారితో ఫొటోలు దిగడానికి స్థానికులు ఆసక్తి చూపారు.

## జాతీయ విద్యావిధానం రద్దుకు పోరాటం



నారాయణపేటలో కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**నారాయణపేట రూరల్:** నూతన జాతీయ విద్యావిధానం రద్దుకు పోరాటం చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరహరి అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కరపత్రాలు విడుదల చేసి ఆయన మాట్లాడారు.. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కుల, మత బేదాలను సృష్టించి మనుషులను విడదీస్తూ, దేశ సంపదను బడా పెట్టుబడి దారులకు కట్టబెడుతుందని విమర్శించారు. ఈ నెల 16న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెకు పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. అలాగే పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆటో స్టాండ్‌లో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బంద్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి పంపిణీ చేశారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహా మాట్లాడుతూ అంగన్వాడీ, ఆశావర్కర్లు, ఐకేపీ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కేజీబీవీ సిబ్బందికి కనీస వేతన చట్టం అమలు చేయాలని కోరారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విదానాలకు వ్యతిరేకంగా శుక్రవారం చేపడుతున్న గ్రామీణ బంద్‌కు సంపూర్ణ మద్దతు ఉంటుందని పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సలీం తెలిపారు. అలాగే నిర్భయ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని పీఓడబ్ల్యు జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమంలో సంఘ నాయకులు పవన్, శ్రీశైలం, మారుతి, శ్రీకాంత్, సాబీర్, బాలవర్ధన్, రాము, నర్సింహ, మునీర్, బాలప్ప, చెన్నారెడ్డి, రవి, రెడ్డప్ప, హైమవతి, గజలప్ప, భీమయ్య, పరంజ్యోతి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



మధ్యాహ్నభోజనాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంఈఓ

**నర్వ:** ఉపాధ్యాయులు పాఠశాలలో సమయపాలన తప్పక పాటించాలని ఇన్‌చార్జి ఎంఈఓ వెంకటయ్య అన్నారు. గురువారం సీపూర్, రాయికోడ్, లక్కర్‌దొడ్డి, యాంకి, నాగిరెడ్డిపల్లి, పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులను పాఠాలు చదివించారు. అనంతరం నాణ్యమైన మధ్యాహ్నభోజనం అమలు చేయాలన్నారు. తప్పకుండా లైబ్రరీ పీరియడ్ అమలు చేయాలన్నారు. విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు కృషిచేయాలన్నారు. హెచ్ఎం ఉస్మాన్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రాజు, రాణి, హర్షియాసుల్తాన తదితరులు ఉన్నారు.

## సమస్య లేకుండా చూస్తాం

**మరికల్:** మండలంలోని అప్పంపల్లిలో సమస్యలు లేకుండా చూస్తామని ప్రత్యేక అధికారి దండు శ్రీశైలం అన్నారు. గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. అధికారుల పాలన ప్రారంభమైన పదిరోజుల వ్యవధిలోనే గ్రామంలో పారిశుద్ధ్యం, సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులు చేపట్టామన్నారు. సీసీరోడ్లు లేని వద్ద రోడ్లు వేయించేందుకు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. గ్రామంలో సమస్యలు లేకుండా చూడటమే తమ బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జ్యోతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు ఘన సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**ఊట్కూరు:** నూతనంగా విధుల్లో చేరిన తహసీల్దార్ మమతకు గురువారం కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ శివశ్రీనివాస్ బదిలీపై వికారాబాద్ జిల్లాకు వెళ్లారు. అలాగే ఎంపీడీఓగా విధుల్లో చేరిన ధనుంజయగౌడ్‌కు శాలువతో సన్మానించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ రమేష్‌కుమార్ గద్వాల జిల్లా రాజోలికి బదిలీపై వెళ్లారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మణెమ్మ, కాంగ్రెస్ నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, యజ్ఞేశ్వర్‌రెడ్డి, రవికుమార్, లింగం, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య తీర్చండి



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి

**మాగనూర్:** మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. మాగనూర్‌లో ప్రధానంగా తాగునీటి సమస్య గతకొన్ని నెలలుగా నెలకొందని తెలిపారు. పెద్దవాగులో నుంచి నీటిసరాఫర చేస్తుండటంతో మురుగు నీటితో వివిధ ఆరోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. గ్రామంలోని తాగునీటి సమస్యను వారం రోజుల్లో పరిష్కరిస్తామని పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప తెలిపారు. అలాగే సీసీరోడ్డు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించి పూర్తిచేయాలని నిర్ణయించారు. అదేవిధంగా గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్ర నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరైందని వైద్యసిబ్బంది తెలుపుగా గ్రామంలోని బంజదొడ్డి స్థలంలో భవన నిర్మాణానికి తీర్మానం చేశారుమాజీ సర్పంచ్ రాజు, గ్రామస్తులు ఆనంద్‌గౌడ్, వాకిటి శ్రీనివాసులు, వేణుగోపాల్, ఆంజనేయులు, ఉజ్జెల్లి కృష్ణయ్య, కృష్ణయ్యం, ఆనంద్, పాల్గొన్నారు.

## సీసీరోడ్డు పనులు ప్రారంభం



**మరికల్:** మండలంలోని రాకొండలో ఉపాధిహామీ నిధుల కింద గురువారం సీసీ రోడ్డు పనులను ప్రత్యేక అధికారి మహేశ్వరి ప్రారంభించారు. పనులు చేసే వారు నాణ్యతతో చేయాలని, అలాగే సంబంధిత అధికారి వద్ద ఉండి పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వీరన్న, సూర్య మోహన్‌రెడ్డి, నరహరి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జయసింహరెడ్డి, రాజు పాల్గొన్నారు.

## అయోధ్యకు తరలివెళ్లిన నాయకులు



అయోధ్యకు తరలివెళ్తున్న బీజేపీ నాయకులు


**ఊట్కూరు:** అయోధ్యలో రామమందిర దర్శనానికై బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో బుధవారం మండలం నుంచి బీజేపీ కార్యకర్తలు ఐదుగురు తరలివెళ్లారు. వీరికి మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో బీజేపీ రాష్ట్ర నాయకులు డీకే అరుణమ్మ, శాంతికుమార్, మిథున్‌రెడ్డి వీరికి వీడ్కోలు పలికారు. తరలివెళ్లిన వారిలో పగిడిమారి గ్రామానికి చెందిన అశోక్, భీంరెడ్డి, దేవేందర్, కృష్ణ, నర్సింహులు తదితరులు ఉన్నారు.

**కృష్ణా:** అయోధ్యలో రామమందిర దర్శనానికి బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం మండలం నుంచి బీజేపీ కార్యకర్తలు తరలివెళ్లారు. వీరికి బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అమర్‌కుమార్ దీక్షిత్, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జిగ సురేష్ వీరికి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## విధుల్లో చేరిన గ్రామ కార్యదర్శులు

**ఊట్కూరు:** మండలంలోని 23మంది గ్రామ కార్యదర్శులు గురువారం విధుల్లో చేరారు. ఊట్కూరు గ్రామ కార్యదర్శిగా శ్రీనివాసరావు, అవుసలోనిపల్లి మధురిక, బిజ్వార్ శివయ్య, చిన్నపొర్ల లోకేష్, ఎడివెల్లి జంగిలప్ప, మల్లేపల్లి రాజశేఖర్, నాగిరెడ్డిపల్లి సుమన్, నిడుగుర్తి శ్రీకాంత్, ఓబులాపూర్ లక్ష్మీదేవి, పగిడిమారి ఆసీఫా, పెద్దజట్రం భవిత, పెద్దపొర్ల అర్జున్, పులిమామిడి రవి, సమస్తపూర్ తాజ్, తిమ్మారెడ్డిపల్లి తాండ అరుణ, తిప్పరాసిపల్లి శ్రీకాంత్‌రెడ్డి, వల్లంపల్లి నాగేశ్వరి విధుల్లో చేరారు.

## ఈ కేవైసీ చేసుకోవాలి



**కోస్గి:** పీఎం కిసాన్ నిధి పథకంలో లబ్ధిపొందుతున్న రైతులు తప్పనిసరిగా తమ ఆధార్ వివరాలతో ఈ కేవైసీ చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, ఏఈఓ నరేందర్ సూచించారు. ఈ మేరకు గురువారం నుంచి ప్రారంభమైన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కడంపల్లిలో రైతులకు ఈకేవైసీ చేశారు. కోస్గి, గుండుమాల్ మండలాల పరిధిలో ఈకేవైసీ చేయించుకోని రైతుల జాబితా గ్రామాల వారిగా ఆయా గ్రామ పంచాయతీలో అందుబాటులో ఉంటుందని, రైతులు ఈ నెల 21వరకు ఆయా గ్రామాల ఏఈఓలను సంప్రదించి ఈ కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

## వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న బొగ్గు వెంకటేష్

**మరికల్:** వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపాలని గ్రేటర్ హైదరాబాద్ వాల్మీకి సంఘం అధ్యక్షుడు బొగ్గు వెంకటేష్ అన్నారు. మండలంలోని గురువారం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని వారు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి వాల్మీకులు ఏకతాటిపై రావాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల నాయకులు వారిని సన్మానించారు. వాల్మీకి సేవా సమితి ట్రస్ట్ చైర్మన్ రమణ, హైకోర్టు అడ్వకేట్ గోపాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహులు, చంద్రప్ప పాల్గొన్నారు.

## భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి



బిజ్వార్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



కృష్ణాలో మాట్లాడుతున్న నాయకులు

**కోస్గి (మద్దూరు):** అన్ని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నేడు నిర్వహించే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ప్రగతిశీల రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.యాదగిరి, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కార్యదర్శి కొండ నర్సింహులు, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ పిలుపునిచ్చారు. గురువారం కొత్తపల్లి మండలంలోని భూనీడ్‌లో బంద్‌కు సంఘీభావంగా ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. అలాగే రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మద్దూరులో కరపత్రం విడుదల చేశారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని, రుణాలమాఫీ చేసి కొత్త రుణాలు అందజేయాలని డిమాండ్ చేశారు.రైతుసంఘం మండల అధ్యక్షుడు కొండన్న, ప్రజాసంఘాల నాయకులు చెన్నారెడ్డి, నారాయణ, ఉషప్ప, కిష్టప్ప, రమేష్‌పాల్గొన్నారు.

**ఊట్కూరు:** గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో గురువారం బిజ్వార్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో కేంద్ర ప్రభుత్వానికి నిరసనగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు సిద్ధూ మాట్లాడుతూ.. నల్లచట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు నల్లచట్టాలను రద్దు చేయలేదని ఆరోపించారు. ఈ నెల 16న నిర్వహించే గ్రామీణ భారత్‌బందులో రైతులు, కార్మికులు, విద్యావంతులు పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పొర్ల నర్సింహులు, మల్లేష్, గోవర్ధన్‌రెడ్డి, తిరుపతి, చెన్నప్ప, కతలప్ప పాల్గొన్నారు.

**దామరగిద్ద:** దేశావ్యాప్తంగా చేపట్టనున్న గ్రామీణ బంద్‌ను విజయవంతం చేద్దామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. గురువారం ఉద్మల్‌గిద్దలో ఆటో ట్రాక్టర్‌ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

**కృష్ణా:** కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా శుక్రవారం నిర్వహించే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని మండల రైతు సంఘం నాయకులు నాగేశ్వర్‌రావు, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు ఆనంద్ పిలుపునిచ్చారు. గురువారం టైరోడ్డులోని రైతు సంఘం కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. పూర్తి స్థాయిలో బందు జరిగేందుకు గ్రామాల్లో ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని వారు కోరారు. ఆంజనేయులు, మల్లికార్జున్, వెంకటేష్, రామరావు, రాకేష్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మహాపడి పూజ



మహాపడి పూజ చేస్తున్న శివస్వాముల

**ధన్వాడ:** మండల కేంద్రంలో శివమాలధారులు మల్లికార్జునస్వామి మహాపడి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోటపక్క వీధిలోని గంగమ్మదేవాలయం వద్ద స్వామివారి మండపాన్ని ఏర్పాటుచేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రభు గురుస్వామి ఆధ్వర్యంలో గణపతి పూజ 108కళశపూజ, శివపార్వతుల కల్యాణం, అభిషేకం, మెట్లపూజ నిర్వహించారు. ఇతర గ్రామాల నుంచి శివ మాలధారులు, శివ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.